www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 20 జూన్ 2024



ఇంటర్న్‌షిప్‌కు 'మిట్స్' విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె సమీపంలో మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రెండవ సంవత్సరం చదువుతున్న ఎం.దీక్ష, బి.శ్రావ్యలు చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్‌లో ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఈ ఇంటర్న్‌షిప్ సమయంలో విద్యార్థులు వెబ్ అప్లికేషన్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్‌లో పని చేస్తారని అన్నారు. విద్యార్థులు 45 రోజుల పాటు ఈ ఇంటర్న్‌షిప్‌లో పాల్గొంటారని, ఎంపికైన విద్యా ర్థులను కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, విభాగాధిపతి డాక్టర్ కల్పన, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.



ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులు

వ్యవసాయాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో వ్యవసాయాభివృద్ధిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వ్యవసాయ అనుబంధ శాఖలైన హార్టికల్చర్, సిరికల్చర్, పశుసంవర్ధక శాఖ, ఫిషరీస్, మార్కెటింగ్, కో-ఆపరేటివ్, ఎపిఎంఐపి శాఖల గురించి సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందించే ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఈసారి జిల్లాలో 65,300 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేసే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఇందులో వేరుశనగ 43 వేల హెక్టార్లు, వరి 10, వేల హెక్టార్లు, హార్స్ గ్రామ్ 4200 హెక్టార్లు, కంది 2900 హెక్టార్లు, సాగు చేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు. వేరుశనగకు సంబంధించి ఇప్పటివరకు 53 వేల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేయడం జరిగిందని విత్తన పంపిణీ కార్యక్రమం పూర్తి చేయాలని తెలిపారు. ఎరువులకు సంబంధించి 48,500 మెట్రిక్ టన్నులు జిల్లాకు కేటాయించడం జరిగిందని ఇందులో 2500 మెట్రిక్ టన్నులు పంపిణీ చేయడం జరిగిందని మిగిలినవి ఆర్బికేల ద్వారా త్వరితగతిన రైతులకు ఇవ్వాలన్నారు. గత ఏడాది జిల్లాలో 5 వేల కోట్ల రూపాయల పంట రుణాలు రైతులకు ఇవ్వడం జరిగిందని ఈసారి కూడా అర్హులైన రైతులందరికీ పంట రుణాలు మంజూరు చేసి రైతులకు బ్యాంకర్లు సహకరించాలన్నారు. జిల్లాలో చాలావరకు పాడి రైతులు ఉన్నారని పశుసంవర్ధక శాఖ ద్వారా అమలవుతున్న పథకాలపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో వాతావరణ మార్పుల వల్ల పశువులకు వచ్చే జబ్బుల గురించి పశు వైద్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాకాలంలో చిటుకవ్యాధి, దోమవ్యాధి, వచ్చే అవకాశం ఉన్నందున ఈ వ్యాధులకు సంబంధించిన టీకాలు పశువులకు సకాలంలో వేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో పాల ఉత్పత్తి, గుడ్లు, మాంసం, ఉత్పత్తులపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. లింగ నిర్ధారిత వీర్యనాలి కళ వలన ఉపయోగాలపై క్షేత్రస్థాయిలో రైతులకు పూర్తి అవగాహన కల్పించి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. త్వరలో క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహిస్తామని వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబంధించిన అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో 75 శాతం సబ్సిడీతో 3 వందల టన్నులు గడ్డి విత్తనాలు కావాలని ఇండెంట్ పెట్టడం జరిగిందని పశుసంవర్ధక శాఖ జెడి గుణశేఖర్ పిల్లే కలెక్టర్‌కు తెలిపారు. జులై 6వ తేదీ ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందరరేగా 20 వేల డోసులు పశువులకు వేయాలని ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని, జులై 7 నుంచి 14వ తేదీ వరకు పశుగ్రాసాభివృద్ధి వారోత్సవాల నిర్వహించాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పశుసంవర్ధక శాఖ జెడి తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి చంద్రనాయక్, పశుసంవర్ధక శాఖ జెడి గుణశేఖర్ పెళ్లై, సిరికల్చర్ జిల్లా అధికారి రాజశేఖర్ రెడ్డి, మార్కెటింగ్ ఎడి త్యాగరాజు, మత్స్యశాఖ డిడి సుస్మిత, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి గురుప్రకాష్ రావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలి : ఎస్ఎఫ్ఐ


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నీట్ పరీక్షను దేశవ్యాప్తంగా మరలా నిర్వహించాలని, పరీక్షలలో నెలకొన్న అవకతవకలపై విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, ఉపాధ్యక్షులు రమణ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ నీట్ పరీక్షలలో జరిగినటువంటి అవకత వకలపై అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా గురువారం నుంచి చేపట్టనున్న నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయాలని నీట్ పరీక్ష రాసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షలో పెద్ద ఎత్తున అక్రమాలు, అవకతవకలపై విచారణ జరిపించాలన్నారు. నీట్ పరిక్షపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తగా, కేంద్రంలో మోడీ నేత ృత్వంలోని ఎన్‌డిఎ సంకీర్ణ ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటానికే నిర్ణయించుకుందని విచారం వ్యక్తం చేశారు. కొన్ని రోజులుగా నీట్ స్కాంపై అభ్యర్థులు గగ్గోలు పెట్టడంతో పాటు న్యాయస్థానాలను ఆశ్రయించినా పట్టించుకోని ప్రభుత్వం, చివరికి సుప్రీం కోర్టు కేంద్రానికి, నీట్‌ను నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)లకు నోటీసులు జారీ చేశాక ఎట్టకేలకు విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించి రెండు చోట్ల అక్రమాలు జరిగినట్లు గుర్తించామని అంగీకరించారని తెలిపారు. ఎన్‌టిఎను మెరుగు పర్చాల్సి ఉందని చెప్పుకొచ్చారని, అంతేతప్ప కుంభకోణంపై విచారణ జరిపిస్తామనికాని, అభ్యర్థులకు ఏవిధమైన న్యాయం చేస్తామనికాని తెలపలేదన్నారు. నీట్‌లో అక్రమాలు అవేవో సాధారణంగా చోటు చేసుకున్న చిన్న తప్పులన్నట్లు పేర్కొన్నారు. తప్ప పశ్చాత్తాపం వ్యక్తీకరించలేదన్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా జరిగే కార్యక్రమాలు జయప్రదం చేయడం కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు విద్యావేత్తలు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకుడు రాధా వెంకట్ పాల్గొన్నారు.

పడితే చినుకు.. పట్టదు కునుకు

- కొద్దిపాటి వర్షానికే పొంగిపొర్లుతున్న కాలువలు
- లోతట్టు ప్రాంతాలకు ముంపు భయం
- అవస్థలు పడుతున్న పట్టణ ప్రజలు
- మొరవ స్థలంలో వెలసిన ప్లాట్లు
- ఆక్రమణకు గురైన వంకలు, వాగులు, కాలువలు
- నిద్రావస్థలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణంలో కొద్దిపాటి వర్షానికి కాలువలు పొంగి పొర్లుతున్నాయి. వర్షపు నీరు చెరువుకు వెళ్లే దారి లేక రోడ్లపైకి చేరుతున్నాయి. పట్టణ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షపునీరు రోడ్లపైకి ఎందుకు వస్తున్నాయని కారణాలను వెతికితే విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. చాపకింద నీరులా సాగిపోతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారం వల్ల వంకలు, వాగులు, కాలువలు, కుంటలు కుచించుకుపోయాయి. వర్షాకాలంలో పడే వర్షపు నీరు పారేందుకు పెద్దపెద్ద కాలువలు లేకపోవడంతో కుచించుకు పోయిన కాలవలపైన పొంగుతూ రోడ్లపైకి చేరుతున్నాయి. ఇంత జరుగుతున్నా వర్షం వచ్చినప్పుడు మాత్రం తూతూ మంత్రంగా పనులు చేసే అధికారులు తర్వాత శాశ్వత పరిష్కారం వైపు మొగ్గు చూపడం లేదనే విమర్శలు వెళు వెత్తుతున్నాయి. సోమవారం మదనపల్లెలో 89.9 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. కొద్ది పాటి వర్షానికే నీరుగట్టువారిపల్లి అనుకొని ఉన్న గజ్జల కుంట నిండింది. ఆ కుంట దిగవన ఉన్న మరో చిన్న నీటి కుంట నిండడంతో తెగిపోయి నీరంత కాలువల్లోకి చేరింది. ఈ కుంటకు గతంలో ఉన్న మొరవ స్థలం మొత్తం ఆక్రమణకు గురి కావడంతో ఆ స్థలంలో ప్లాటు వెలసి దర్శనమిస్తున్నాయి. మళ్లించిన కాలువ గుండా నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో నీరంతా రోడ్లపైకి చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. గతంలో మొరవ నుంచి పారే వర్షపు నీరు ఎస్‌బిఐ కాలనీ నుంచి కాలువ ద్వారా కోమిటివాని చెరువుకు చేరేది. కాలక్రమేన భూమి ధరలు ఆకాశాన్నంటడంతో అధికారులు, ప్రజానాయకులను రియల్టర్లు ప్రలోభాలకు గురిచేసి వంకలు, వాగులు, కాలువలు, నీటికుంటల స్థలాలను కబ్జా చేసి, అక్రమంగా ప్లాట్లు వేసి విక్రయించుకుని సొమ్ము చేసుకున్నారనేది బహిరంగ రహస్యం. ఫలితంగా వర్షపు నీరు రోడ్లపైకి చేరుతూ రాబోయే ముప్పును హెచ్చరిస్తోంది. తద్వారా రోడ్లు నీటితో పొంగిపొర్లుతున్నా వేరేదారి లేక దిక్కుతోచని స్థితిలో ఆ రోడ్లపైనే వాహనాల్లో వెళుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

సోమవారం రాత్రి కురిసిన కొద్దిపాటి వర్షానికి మదనపల్లె జలదిగ్బంధమైంది. కురవంకలోని పలు ఇళ్లలోకి వర్షపు నీరు నిత్యావసర సరుకులు అన్ని తడిసి ముద్దయ్యాయి. సుమారు 25 ఇళ్లు నీట మునిగాయి.


కురవంకలోని ఓ ఇంట్లోకి చేరిన వర్షపు నీరు


ఆక్రమణకు గురైన మొరవ స్థలంలో వెలసిన ప్లాట్లు

సమాచారం అందుకున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ముంపు ప్రాంతాల్లో పర్యటించి తక్షణ సాయంగా ఒక్కో ఇంటికి 20 కిలోల బియ్యాన్ని పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. శ్రీకృష్ణ థియేటర్ సమీపంలోని జాతీయ రహదారిపై మురుగునీరు ప్రవహించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో సైతం రోడ్డుపై నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గతంలో ఓ సారి పడిన వర్షానికి అంబేద్కర్ సర్కిల్ జలమయమైంది. సుమారు 20 రోజులు ప్రజలు రాకపోకలు స్తంభించి పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. నిమ్మనపల్లె సర్కిల్, చిత్తూరు బస్టాండు పరిసరాలను నీటి వరద ముంచెత్తింది. ఇదిలానే కొనసాగితే పెనుప్రమాద ముప్పు పొంచి ఉంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు సరైన ప్రణాళిక తో చర్యలు చేపట్టాల్సి ఉంది.

1996లో మదనపల్లెను ముంచెత్తిన వరదలు

1996వ సంవత్సరంలో మదనపల్లెను వరదలు ముంచెత్తాయి. ఈ వరదల్లో మేదరువీధి, బెంగళూరు బస్టాండు, చిత్తూరు బస్టాండు, ఆర్టీసీ బస్టాండులు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. అప్పట్లో 16 మంది మృత్యువాత పడడం సంచలనం రేకెత్తించింది. తరువాత అంతగా వర్షాలు పడకపోయినప్పటికి కొద్దిపాటి వర్షానికే మదనపల్లె జలదిగ్బంధం అవుతోంది. రెండేళ్ల క్రితం పడిన వర్షానికి ఎన్టీఆర్ సర్కిల్‌లోని దివాకర్ మొబైల్ షాపులో వర్షపు నీరు చేరి సుమారు రూ.30 లక్షలకు పైగా ఆస్థి నష్టం సంభవించింది. షాపులోని మొబైల్స్, కంప్యూటర్స్, లాప్ టాప్స్, విడిపరికరాలు మొత్తం తడిసి ముద్దయ్యాయి. కబ్జాల రూపంలో తిరిగి అలాంటి ముప్పు పొంచి ఉంది అని అన డంలో సందేహం లేదు. భవిష్యత్తులో ముప్పు పొంచి ఉన్నా, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నిద్రావస్థ వీడడం లేదు. వంకలు, వాగులు, కాలువ స్థలాలు కబ్జాలకు గురవుతున్న, ఆక్రమిస్తున్న కనీస చర్యలు చేపట్టడం లేదు. పట్టణంలోని పలు రోడ్లు జలమయమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు కబ్జాలు అరికట్టి, వెడల్పాటి కాలువలు, మొరవలను ఏర్పాటు చేసి వర్షపు నీరు నేరుగా చెరువులకు చేరే విధంగా పనులు చేపట్టాల్సి ఉంది.

వర్షపు నీటిని చెరువులోకి పంపాలి



గజ్జలకుంట నుంచి వచ్చే వర్షపు నీరు ఎస్‌బిఐ కాలనీలో రోడ్డుపైన పారుతోంది. ఈ సమస్యను అధిగమించాలంటే కాలువలను వెడల్పు చేసి కల్వర్టును నిర్మించి నీటిని చెరువులోకి మళ్లించాలి.

- పి.శ్రీనివాసులు, సిపిఎం జిల్లా కార్యదర్శి, అన్నమయ్య.

ఆక్రమణలను తొలగించాలి



నీరు సాఫీగా పారేందుకు వీలు లేకుండా కాలువ ఆక్రమణకు గురైంది. వెంటనే ఆక్రమణలు తొలగించి గతంలో ఉన్న కాలవను యధావిధిగా వెడల్పు చేస్తే నీరు రోడ్లపైకి వచ్చే సమస్య ఉండదు.

- కృష్ణమూర్తి, స్థానికుడు, మదనపల్లె.

ఆక్రమణలపై తహశీల్దారుకు లెటర్ పడుతాం

కాలువ స్థలం ఎంతమేర ఆక్రమణకు గురైందో తహశీల్దారుకు లెటర్ పెడుతాం. ఆ తరువాత అసక్రమణలు తొలగించి కాలువలు వెడల్పు చేపడుతాం. మొరవ స్థలాన్ని స్వాధీనం చేసుకుంటాము.

- సురేంద్రారెడ్డి, ఇరిగేషన్ ఇఇ, మదనపల్లె.


రాయచోటి :పార్టీ కార్యాలయంలో కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భావిభారత ప్రధాని రాహుల్ గాంధీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : భావి భారత ప్రధానమంత్రి రాహుల్‌గాంధీ అని మదనపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ నేత రెడ్డి సాహెబ్ పేర్కొన్నారు. బుధవారం రాహుల్‌గాంధీ 52వ జన్మదిన వేడుకలను పార్టీ కార్యాలయం లో ఇండియా కూటమి నేతల ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. కేక్ కట్ చేసి, స్వీట్స్ పంచి, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ లోని గుణాన్ని, జవహర్‌లాల్ నెహ్రూ వారసత్వాన్ని, ఇందిరాగాంధీ పోరాట పటిమను, రాజీవ్ గాంధీ విజ్ఞానాన్ని అందిపుచ్చుకున్నారని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం శ్రీనివాసులు, ఎఐటియుసి సాంబశివ, కాంగ్రెస్ నాయకులు బాషా, మీనాకుమారి, ముబారక్ ఖాన్, సమీరుద్దీన్, రవీంద్ర, సోమశేఖర్, మహబూబ్ పీర్, అర్బాస్, ఈశ్వరమ్మ, మస్తాన్ పాల్గొన్నారు. **రాయచోటి :** రాహుల్ గాంధీ 54వ జన్మదిన సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా డిసిసి అధ్యక్షులు అల్లాబకష్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి పండ్లు స్విట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ రఫీక్, డిసిసి మైనార్టీ చైర్మన్ సయ్యద్‌అలీ, డిసిసి జనరల్ సెక్రెటరీ మొహమ్మద్‌అలీఖాన్, డిసిసి కిసాన్ ప్రెసిడెంట్ చెన్న కృష్ణ, డిసిసి సెక్రెటరీ బషీర్ బేగ్, షేక్ మహమ్మద్ అలీ, షబ్బీర్, జబిల్లా, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతమైన స్థానాల ను అధిరోహించాలని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. మండలం లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నభ్యసించి పదవ తరగతి పరీక్షా ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సంస్థ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు ప్రశంసా పత్రం, నగదు బహుమతితో పాటు జ్ఞాపికలు అందించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్.ఆదిత్య, ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.జాస్మిన్‌లకు బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా సేవా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు మట్టిలో మాణిక్యాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యతోపాటు క్రమశిక్షణ, సామాజిక విలువలు నేర్పిస్తారని తెలిపారు. త్వరలోనే మిగిలిన ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు అబ్దుల్లా, కార్య దర్శి కే.సురేష్, సంస్థ ప్రతి నిధులు కాకర్ల రాముడు, తుంగా రమణారెడ్డి, కనిగిరి సురేష్, వేణుగోపాల్ నాయుడు, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.


విద్యార్థికి నగదు, ప్రశంసా పత్రం అందిస్తున్న మానవత సభ్యులు

చేనేత కార్మికుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. తాను నమ్మిన వారి మోసం చేశారని సూసైడ్ నోట్ వెంట తెచ్చుకున్న బ్యాగ్‌పై రాసి చెట్టుకు ఉరేసుకున్నాడు. ఈ విషాదకర సంఘటన బుధవారం కురబ లకోట మండలంలో వెలుగు చూసింది. ముదివేడు ఎస్ఐ మల్లి కార్జున్‌రెడ్డి, మృతుడు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, నీరుగట్టువారిపల్లె, మారుతి నగర్‌లో నివాస ముంటున్న రామిశెట్టి రమేష్ బాబు(50) మగ్గాలు నేసుకుంటూ జీవనం చేసేవాడు. ఇతనికి ఇద్దరు భార్యలు, నలుగురు పిల్లలు ఉన్నా రు. స్థానికంగా ఉంటున్న పురాణం చంద్రశేఖర్, వెంకటేష్, శివారెడ్డి అనే ముగ్గురు కలిసి రమేష్ బాబు స్థలం ఇస్తామని రెండేళ్ల క్రితం రూ.5 లక్షల నగదును తీసుకున్నారు. అప్పటి నుంచి స్థలం చూప కుండా కాలయాపన చేశారు. నగదుకు సంబంధించి ఎలాంటి అగ్రిమెంటు ఇవ్వలేదు. వారి మధ్య మనస్పర్థలు తలెత్తాయి. ఇంకోపక్క మగ్గాల నిర్వహణకు పలుచోట్ల అప్పులు చేశాడు. ఇంట్లో సమస్యలు మొదలయ్యాయి. ఏమిచేయాలో పాలు పోని రమేష్ జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి ఇం ట్లోంచి వెళ్లిపోయాడు. వెంట తీసుకెళ్లిన బ్యాగుపై తన మృతికి వెంకటేష్, చంద్ర, శివారెడ్డిలే కారణమని సూసైడ్ నోట్ రాశాడు. అంగళ్లు సమీపంలోని మల్లయ్య కొండ వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉన్నత సమాజ స్వాప్నికతే ధ్యేయం : జడ్జి

ప్రజాశక్తి-కడప సిటీ

ఉన్నత సమాజ స్వాప్నికతే విద్యార్థి విజయ రహస్యం పుస్తకం ధ్యేయమని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ సీనియర్ సివిల్ జడ్జ్ బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో 'విద్యార్థి విజయ రహస్యం' అనే పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ నేటి విద్యార్థులు రేపటి భావితర పౌరులుగా, సమాజ నిర్దేశకులుగా తీర్చిదిద్దడానికి విద్యార్థి విజయ రహస్యం అనే పుస్తకాన్ని రచించారన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు సంస్కారం, జ్ఞానంతో పాటు లోకజ్ఞానం, ఆధ్యాత్మిక భక్తి భావాలు పెంచే దిశగా భగవద్గీత, భాగవతం లాంటి శ్లోకాలు, పద్యాలను క్రోడీకరించి సందర్భోచితంగా విద్యార్థులకు నైతిక విలువలు పెంపొందించే దిశగా ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను గౌరవించే దిశగా సమాజంలో ఉన్నత స్థానం చేరుకోవడానికి కావలసిన స్ఫూర్తిదాయకమైన కథలను జతచేస్తూ రచించారు. అటువంటి గొప్ప పుస్తకాన్ని ఈ సమాజానికి పరిచయం చేసిన ప్రభాకర్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు.

బడిలో వేసే అడుగు.. భవితకు 'వెలుగు'

ప్రజాశక్తి-పీలేరు

బడిలో వేసే అడుగే విద్యార్థుల భవితకు వెలుగవుతుందని పీలేరు మండల తహశీల్దారు మహబూబ్ బాష, ఎంపిడిఒ ఉపేంద్రారెడ్డి, ఎంఇఒలు వై.లోకేశ్వర్‌రెడ్డి, బి.పద్మావతమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వరూప తెలిపారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో" నేను బడికిపోతా" మండల స్థాయి కమిటీ కార్యక్రమం, మండల వనరుల కేంద్రంలో విద్యా సదస్సు కార్యక్రమాలు వేర్వేరుగా జరిగాయి. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు మాట్లాడుతూ నేను బడికిపోతా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, బడి మానివేసిన విద్యార్థుల కోసం అందరు కలసి పనిచేయాలన్నారు. బడి బయట పిల్లల్ని బడిలో చేర్చే కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు పాఠశాల కమిటీ, సీ.ఆర్.పీలు, సచివాలయ విద్యా సంక్షేమ సహాయకులు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, వాలంటీర్లు పాల్గొనాలని కోరారు. ఐసిడిఎస్ సూపర్వైజర్లు కూడా ఇందుకు సహకరించాలని కోరారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు జూన్ 13వ నుండి జూలై 12వ తేదీ వరకు ప్రభుత్వం 'నేను బడికి పోతా' అనే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. 6 నుంచి 14 ఏళ్ల వయస్సు పిల్లలందరూ బడులలోనే ఉండాలని, బడి మానేసిన పిల్లలను తిరిగి బడుల్లో చేర్పించాలనేదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. అందుకు ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీలు, సిఆర్‌పిలు, వాలంటీర్లతో కలిసి పాఠశాల ఆవాస ప్రాంతాల్లో బడిఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని, తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహించి వారితో విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తు కోసం బాగా చదువుకోవడం ద్వారా అది సాధ్యమని, ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ బడుల్లో ఆధునిక భవనాలు, శుభ్రమైన మరుగుదొడ్లు, విశాలమైన మైదానంతో పాటు విద్యార్థులు బాగా చదువుకునేందుకు వీలుగా అహ్లాదకరమైన వాతావరణం ఉందన్నారు. మారుతున్న కాలానికనుగుణంగా తరగతి గదుల్లో డిజిటల్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ ఉపేంద్రారెడ్డి

స్టూడెంట్స్ కిట్ పేరుతో కొన్ని వేల రూపాయల విలువ చేసే పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగు, బెల్ట్, షూలను అందజేయడం మొదలగు విషయాలను వారికి తెలియచేయాలని పేర్కొన్నారు. విద్యార్థులకు మధ్యాహ్నం భోజనంలో గుడ్లు, చిక్కీలతో పాటు రుచికరమైన భోజనం, రాగి జావను విద్యార్థులకు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అందించే ఈ సదుపాయాలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరమని వారందరూ బడిలోనే ఉండాలన్నారు. "నేను బడికి పోతా" కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాభివ ృద్ధి కార్యక్రమాల గురించి పిల్లలు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి 100 శాతం పిల్లలు పాఠశాలలకు వచ్చేలా చర్యలు తీసుకోవడం అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమాల్లో అధికారులతో పాటు ఉపాధ్యాయులు రహత్ బాష, అక్రం బాష, ఉర్దూ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గాజులఖాదర్‌బాషా

రాష్ట్రానికి ఇక అన్నీ మంచిరోజులే : 'గాజుల'

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్ర ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రానికి మంచి రోజులు రాబోతున్నాయని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌భాషా పేర్కొన్నారు. బుధవారం టిడిపి కార్యాల యంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజాతీర్పుతో ప్రజా పాలన మొదలైందని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా ప్రజలు తామే గెలిచామన్నంత సంతోషంలో ఉన్నారని తెలిపారు. నాడు జరిగిన అన్యాయాలను నిర్భయంగా ప్రస్తావిస్తూ తాము పడిన క్షోభపై గళం విప్పుతు న్నారని పేర్కొన్నారు. మహిళలు తమ రక్షణపై, తల్లులు తమ బిడ్డల భవిష్యత్తు పై ధైర్యంగా ఉన్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో పాలనలో అమరావతి రాజధానిగా నిలబడుతుంది అన్నారు. రాజధాని రైతుల పోరాటాలు ఫలించి వారి జీవితాల్లో చీకట్లు తొలగిపోయాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల భాగ స్వామ్యంతో ప్రతి వర్గానికి, ప్రతి ప్రాంతానికి మంచి చేయాలనే చంద్రబాబు సంకల్పం నెరవేరబో తోందని చెప్పారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో రాయచోటి మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాలతో ఆయన సోదరుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు.మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి వలన మైనార్టీలు పూర్తిగా నష్టపోయారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయ కులు రమణారెడ్డి, సంజీవరెడ్డి, అంజద్‌బాషా, రాష్ట్ర లీగల్ సెల్ కార నిర్వాహక కార్యదర్శి యూసుఫ్, మైనార్టీ సెల్ కార్యదర్శి జావీద్, వినోద్, నరసింహనాయుడు, సలీం, ఆబిద్, సాగీర్ పాల్గొన్నారు.

22న పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఈ నెల 22న విద్వాన్ కె.వి.రమణారెడ్డి రచించిన 'ప్రజ్ఞాన ప్రకాశిక' పుస్తకం ఆవిష్కరణ నిర్వహించనున్నట్లు రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు ఒక ప్రకటనలో తెలిపారు. పుస్తకావిష్కరణలో భాగంగా అదే రచయిత రాసిన 'గీర్వాణి తిలకం గీతాంజలి' పుస్తకం పరిచయం కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి వైవీయూ పాలకమండలి సభ్యుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అధ్యక్షత వహిస్తారని తెలిపారు. వైవీయూ విసి ఆచార్య చింతా సుధాకర్ పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారని పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా ఆచార్య జి.శివారెడ్డి పాల్గొంటారని, ఆచార్య మేడిపల్లి రవికుమార్ పుస్తక సమీక్ష చేస్తారని, గజ్జెల అశోక్ రెడ్డి పుస్తక పరిచయం నిర్వహిస్తారని తెలిపారు. గౌరవ అతిథులుగా బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి, వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి అచార్య నల్లపరెడ్డి ఈశ్వరరెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.


విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రయివేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన, మౌలిక సదుపాయాలు కల్పన, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నామని ఎంఇఒ ఆర్.రెడ్డిశేఖర్ పేర్కొన్నారు. విద్యాసదస్సు నిర్వహణలో భాగంగా బుధవారం విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్నటువంటి సౌక ర్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 నుంచి 18 సంవత్స రాలలోపు గల బాలబాలికలందరూ పాఠశాలల్లో చేరి విద్యనభ్యసించాలని సూచించారు. బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని, ప్రభుత్వం పాఠశాలల్లో కల్పిస్తున్నటువంటి సౌకర్యాలను గూర్చి అందరికీ తెలియజేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో అందుతున్న సౌకర్యాలను దృష్టిలో ఉంచు కొని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడులలోనే చేర్పించాలని కోరారు. బడి బయట పిల్లలు నమోదు కొరకు స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసినట్లు తెలపారు..ఈ కార్యక్రమంలో కస్తూరిబా బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ విశ్వలత,ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

జిల్లాలో సివిల్ సప్లయ్స్ పాయింట్లలో ఎగుమతి, దిగుమతి చేస్తున్న సివిల్ సప్లయ్ హమాలీలకు జీతాలు మొదటి వారంలోనే అందేలా సివిల్ సప్లయ్ శాఖ జిల్లా స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎఐటియుసి తంబళ్లపల్లి నియోజకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సలీం బాషా, బి.వేణుగోపాల్ రెడ్డిలు డిమాండ్ చేశారు. హమాలీలకు 19 రోజులు కావస్తున్నా ఇంతవరకు వేతనాలు చెల్లించలేదని అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బుధవారం సివిల్ సప్లయ్ పాయింట్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సలీంబాషా మాట్లాడుతూ హమాలీలకు వేతనాలు చెల్లించడంలో ప్రతి నెలా ఆలస్యం జరుగుతున్నదని ఎన్నోసార్లు అధికారులకు తెలిపినా అధికారులు వేతనాలు చెల్లింపు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు .వేతనాలు ఆలస్యం కావడంతో హమాలీలు కుటుంబ పోషణ కోసం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సివిల్ సప్లయ్ పాయింట్ల వాచ్ మెన్లకు సకాలంలో జీతాలు చెల్లించే అధికారులు హమాలీల జీతాలు చెల్లించే విషయంలో అధికారులకు చులకన భావం ఎందుకని ఆయన అధికారులను ప్రశ్నించారు. 2021-2023 అగ్రిమెంట్ పూర్తయి ఆరు నెలలు కావస్తున్నా ఇంతవరకు నూతన అగ్రిమెంట్ చేయలేదని, తక్షణమే అధికారులు నూతన అగ్రిమెంట్ చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఎఐటియుసి అనుబంధ సంఘం బి.కొత్తకోట సివిల్ సప్లై గోడౌన్ హమాలీలు ఎన్.బాబాజాన్, లక్ష్మన్న, జబీవుల్లా, వెంకటరమణ, రాజి, గంగాధర్, గణి,అస్లాం పాల్గొన్నారు.


భోజనాన్ని వడ్డిస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-రామాపురం

మండల కేంద్రంలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో బుధవారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నదానం కార్యక్రమం పాల్గొన్నారు. మండల కేంద్రంలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో ప్రారంభం రోజు నుంచి దాతలు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మండలంలోని చిట్లూరు పంచాయతీ చెరువుముందరపల్లెకు చెందిన గాలి వీడు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాభారత యజ్ఞం నిర్వహించే ప్రాంతంలో వర్షాలు బాగా కురిసే పంటలు బాగా పండి సస్యశ్యామలంగా ఉంటుందని అన్నారు. రామా పురంలో గత 20 సంవత్సరాలుగా లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మద్దిరేవుల రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మహాభారత యజ్ఞం నిర్వహించడం సంతోషకరమని అన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడిన టిడిపి నాయకులు సురేందర్‌రెడ్డిని పరామర్శిం చారు. కార్యక్రమంలో నల్లగుటపల్లి మాజీ ఎంపిటిసి రవికుమార్‌రెడ్డి, టిడిపి నాయకులు వెంకట్రాంరెడ్డి, భవనం వెంకట రామిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి మహాభారత యజ్ఞం కమిటీ సభ్యులు సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.

సిఎం, డిప్యూటీ సిఎం చిత్రపటాలు అందజేత

ప్రజాశక్తి- రామసముద్రం

మండలంలోని పెద్దకురప్పల్లి పంచాయతిలోని సచివాలయంలో బుధవారం మండల పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాలకు సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చిత్ర పటాలను పంచాయతి కార్యదర్శి బానుమూర్తికి అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు వెంకటరమణరెడ్డి, రెడ్డిశేఖర్, హరనాథ్‌రెడ్డి, రామకృష్ణరెడ్డి, వేణుగోపాల్, వెంకటరమణ నాయుడు, పాల్గొన్నారు.

కూచిపూడిలో కార్తీక ఉత్తమ ప్రతిభ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

కూచిపూడి నృత్యంలో ఎర్రగుంట్ల పట్టణానికి చెందిన పాలగిరి కార్తికరెడ్డి ఉత్తమ ప్రతిభతో అందరినీ అలరిస్తోంది. హైదరాబాదులోని రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర ఏర్పడి 10 సంవత్సరాలు కావడంతో 'నా తెలం గాణ కోటి రత్నాల వీణ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పాలగిరి రామిరెడ్డి, వందన కుమార్తె కార్తీకరెడ్డి కూచిపూడి నృత్యా న్ని అద్భు తంగా ప్రదర్శించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దైవజ్ఞ శర్మ, స్వర్ణ కంకణ గ్రహీత డాక్టర్ ఆమని, నటరాజ్ అకాడమీ అధ్యక్షులు కిషన్ పాల్గొన్నారు. కూచిపూడి నృత్యంతో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కార్తికరెడ్డిని అతిథులు శాలువాలతో సత్కరించి షీల్డ్‌ను బహుమతిగా ప్రదానం చేశారు. కూతురు ప్రతిభకు రెండు తెలుగు రాష్ట్రాల్లో మంచి పేరు ప్రఖ్యాతలు చూసి తల్లిదండ్రులు రామిరెడ్డి, వందన ఆనందం వ్యక్తం చేశారు.


నృత్య భంగిమలో కార్తీకరెడ్డి

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

కోసవారిపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ అనుపమ ఆదేశాల మేరకు సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వసతిగృహాల్లో దోమల నివారణకు మెలం థిన్‌ను పిచకారి చేశారు. స్థానిక బిసి బాలుర హాస్టల్, కస్తూరిబా బాలికల పాఠశాల, మోడల్ స్కూల్, గిరిజన బాలుర రెసిడెన్షియల్ స్కూళ్లలో దోమ ల మందును పిచకారి చేశారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత పాటిం చాలని, గదులు శుభ్రంగా ఉంచుకోవాలని ఆరోగ్య సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్ర మంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


దోమల మందును పిచకారి చేస్తున్న సిబ్బంది

దళితుడిపై చేయిచేసుకున్న ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

- మాలమహానాడు నాయకులు డిమాండ్

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ఓ సమస్యపై బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి తమ సమస్యను పరిష్కరించాలని ఫిర్యాదు చేయగా అక్కడ ఉన్న ఎస్ఐ బాధితులపైనే దురుసుగా ప్రవర్తిస్తూ చేయి చేసుకున్న సంఘటన నిమ్మనపల్లి పోలీస్ స్టేషన్‌లో జరిగిందని మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ యమలా సుదర్శనం అన్నారు. బుధవారం మాల మహానాడు నాయకులు, దళిత సంఘాల నాయకులు కలసి పోలీసు స్టేషన్ ఎదుట బాధితులకు న్యాయం జరగాలని, దురుసుగా ప్రవర్తించిన ఎస్ఐ లోకేష్‌రెడ్డి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మదనపల్లి రూరల్ సర్కిల్ సిఐ సద్గురుడు, మదనపల్లి తాలూకా సిఐ శేఖర్ లకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లి మండలం బసినికొండకు చెందిన సి.రామకృష్ణ, నిమ్మనపల్లి మండలం ఎగువమాచిరెడ్డిగారిపల్లెకు చెందిన శంకరతో కలసి తన కారును బసినికొండకే చెందిన మరో వ్యక్తి వద్ద రూ.50వేలకు కుదవ పెట్టారని అన్నారు. ఒప్పందం ప్రకారం కారును ఇతర అవసరాలకై వినియోగించకూడదని ఆ వ్యక్తి వద్ద నుంచి ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు. అయినా ఆ వ్యక్తి కారును తన సొంత పనులకు వినియోగించు కోవడంతో, తాము చెల్లించాల్సిన 50 వేల రూపాయలకు సంబంధించిన వడ్డీని చెల్లించమని కేవలం అసలును మాత్రమే చెల్లిస్తామని కారు యజమాని చెప్పడంతో, వీరి మధ్య మనస్పర్థలు వచ్చాయని చెప్పారు. ఇదే విషయమై రెండు నెలల క్రితమే నిమ్మనపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినా, స్థానిక ఎస్ఐ లోకేష్ రెడ్డి ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోగా, గత రెండు నెలల నుంచి వారిని స్టేషన్‌కు పదేపదే తిప్పుకోవడం జరిగిందన్నారు. ఇదే విషయమై మంగళవారం మరోసారి రామకృష్ణ, శంకరలను పోలీసుస్టేషన్‌కు పిలిపించగా, వారు స్థానిక ఎస్ఐతో తమను పదే పదే స్టేషన్‌కు తిప్పుకుంటున్నారే తప్ప తమ సమస్యను మాత్రం మీరు పరిష్కరించలేదని అన్నారని అన్నారు. వారి మాటలకు ఆవేశం చెందిన ఎస్ఐ దళితుడైన రామకృష్ణ, బిసి కులస్థుడైన శంకరాపై చేయి చేసుకున్నారని అన్నారు. ఫిర్యాదు చేసిన వారిపైనే పోలీసు అధికారి చేయి చేసుకోవడంపై మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. బాధితులపై చేయి చేసుకున్న ఎస్ఐపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో న్యాయం కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు రాయలసీమ అధ్యక్షులు హరి, జిల్లా అధ్యక్షులు శివయ్య, యమలా చంద్రయ్య, వీరనాల మాణిక్యం, ఎర్రయ్య, బి.సుధాకర్, ఎమ్మార్పీఎస్ రెడ్డి నారాయణ, బాస్ చంద్రాయుడు, ప్రజాసేవా సంస్థ అధ్యక్షుడు సహదేవ, గుమ్మడి గంగులప్ప పాల్గొన్నారు.


ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని సిఐలకు వినతి పత్రం అందిస్తున్న మాలమహానాడు నాయకులు

పచ్చదనం, పరిశుభ్రతే లక్ష్యం : సర్పంచ్


చెత్తను తొలగిస్తున్న సిబ్బంది


వీధి దీపాలకు మరమ్మతులు చేస్తున్న లైన్‌మెన్

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని పుల్లంపేట గ్రామపంచాయతీలో బుధవారం స్థానిక సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య పను లను, వీధి దీపాల మరమ్మతులను చేయించారు. పంచాయతీ మొత్తం ఉన్న చెత్త దిబ్బలు, మురికి కాలు వలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా చెదారంతో కూడిన దిబ్బ లను జెసిబి , డోజర్ సహా యంతో తొలగింపజేశారు. గ్రామ పంచాయతీని పచ్చదనం, పరిశుభ్రత, ఆరోగ్య కరంగా తీర్చి దిద్దా లనే దృఢ సంకల్పంతో సర్పంచ్ అయిన మొదటి రోజు నుంచే పనిచేస్తున్నానని అన్నారు. పంచా యతీలో ఎక్కడ ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకుని వస్తే తక్షణమే సమస్యను పరిష్క రిస్తానని తెలిపారు. వీధిదీపాలకు మరమ్మ తులు చేయడం జరిగిందని, ఎక్కడైనా వీధిదీపాలు లేకున్నా, వెలుగకున్నా ఎటువం టి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుక రావాల ని చెప్పారు. వర్షాకాలం కాబట్టి విష సర్పాలు సంచ రిస్తుంటాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఏళ్ల వేళలా అందుబాటులో ఉంటానని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పెంచలయ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కూలిన కల్వర్టును పరిశీలించిన ఆర్అండ్‌బి అధికారులు

నివేదికలను సిద్ధం చేసి రాష్ట్ర కార్యాలయానికి పంపిన అధికారులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-నిమ్మనపల్లె


నిమ్మనపల్లి నుంచి వాల్మీకిపురం, గుర్రంకొండ, గాలివీడుకు అనుసంధానమైన ప్రధాన రహదారిలోని కొమ్మిరెడ్డిగారిపల్లి వద్ద బహుదానదిపై ఉన్న కల్వర్టు ఇటీవల కురిసిన వర్షానికి కూలిపోయింది. ప్రమాదపు అంచున వాహనాల రాకపోకలు కొనసాగిస్తున్న వైనంపై బుధవారం ప్రజాశక్తి దినపత్రికలో 'కూలిన కల్వర్టు.. పొంచి ఉన్న ప్రమాదం' అనే శీర్షిక ప్రచురితమైంది. ఈ వార్తపై స్పందించిన ఆర్అండ్‌బి అధికారి డిఇఇ రాజేంద్రప్రసాద్ కూలిన కల్వర్టును క్షేత్రస్థాయిలో బుధవారం ఉదయం ఆర్అండ్‌బి ఎఇఇ బుర్రయ్యతో కలసి పరిశీలించారు. కల్వర్టు కూలిన విధానం, భవి ష్యత్తులో వాహనాల రాకపోకలకు, రవాణా సౌకర్యాలకు ఏర్పడే అంతరాయాలను అంచనా వేశారు. ఈ కల్వర్టుకు ఎగువన బహుదా ప్రాజెక్టు ఉన్నందున భారీ వర్షాలు కారణంగా వచ్చే వరదలతో కొట్టుకుపోయే ప్రమాదము నిర్ణయించారు. ఈ మార్గంపై ఎత్తైన వంతెనను కట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆ విధంగా నివేదికలను సిద్ధం చేసి రాష్ట్ర కార్యాలయానికి పంపినట్లు ఆర్అండ్‌బి డిఇఇ రాజేంద్రప్రసాద్ తెలిపారు.


కూలిన కల్వర్టును పరిశీలిస్తున్న డిఇఇ రాజేంద్రప్రసాద్

తగ్గిన వేరుశనగ సాగు - ప్రత్యామ్నాయంపై మొగ్గు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఆరుగాలం కష్టించే రైతన్నలు వేరుశనగ సాగుకు స్వస్తి పలికి, ప్రత్యామ్నాయ పంటలతో కుస్తీ పడుతున్నారు. వేరుశనగ పంటకు విపరీతమైన ఖర్చు రావడం, దిగుబడి దశలో గిట్టుబాటు ధర ఉండకపోవడంతో ఆ పంట సాగుకు స్వస్తి పలికినట్లు రైతులు తెలి పారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు వివిధ రకాల పంటలపై దృష్టి సారిం చారు. ఖరీఫ్ సీజన్ రానే వచ్చింది. ప్రకృతి కూడా అనుకూలించింది. సకాలంలో వర్షం కురిసింది. ఇంకేముంది ఆశలు మదిలో నింపుకుని రైతన్నలు వేరుశనగ విత్తనం ప్రారంభించారు. ప్రస్తుతం వేరుశనగ సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. గతంలో పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 70 నుంచి 80 శాతం వరకు వేరుశనగ సాగించేవారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తే కేవలం 15 నుంచి 20 శాతం మంది రైతులు మాత్రమే వేరుశనగ సాగు పట్ల మక్కువ చూపు తున్నట్లు తెలుస్తోంది. కాడెద్దులు కూడా దొరకని పరిస్థితి నేడు ఎదురైంది. గతంలో పశుగ్రాసం కోసం వేరుశనగ సాగు చేసే రైతులు నేడు ఆ పంటకు దూరం కావడం బాధాకరం. ఈ విధంగా వేరుశనగ సాగుకు ప్రత్యామ్నాయంగా పత్తి, ఉద్ది, కంది, పెసర, ఇనుము తది తర పంటల సాగుపై రైతులు దృష్టి సారించారు. కృష్ణా జలాలు అందు బాటులో ఉన్న కారణంగా ప్రతి రైతు నీటి వసతిపై ఆధారపడి వివిధ పంటలను సాగు చేస్తు న్నారు. ఈ నేపథ్యంలో కూడా సాగునీటి పైనే ఆధారపడి వేరుశనగ చేపట్టనున్నట్లు రైతులు వెల్లడించారు.



ఆర్‌టిసి బస్టాండ్‌లో సిగరెట్లు, బీడీలు స్వాధీనం


నిషేధిత వస్తువులను ధ్వంసం చేస్తున్న డిఎం బృందం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు ఆర్‌టిసి బస్టాండ్ లోని వ్యాపార సముదాయాల్లో తనిఖీలు నిర్వహించి నిషేధిత సిగరెట్లు, బీడీలు స్వాధీనం చేసుకున్నట్లు డిపో మేనేజర్ బండ్ల కుమార్ తెలిపారు. బుధవారం ఆయన తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించామన్నారు. ఇకపై దుకాణాల్లో నిషేధిత వస్తువులను అమ్మరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రెడ్డి , ఆర్టీసీ సెక్యూరిటీ కానిస్టేబుల్ బాబు నాయక్, బస్ స్టేషన్ మేనేజర్ పాల్గొన్నారు. అలాగే స్థానిక గ్యారేజ్లో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ ఏర్పాటు చేసి మే నెలలో అత్యున్నత ప్రతిభ కనబరచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రం, నగదు బహుమతితో సత్కరించారు. ఇందులో 143 లీటర్ల డీజిల్ పొదుపు చేసిన డ్రైవర్ కెవి స్వామికి ప్రథమ బహుమతిని, 129.33 లీటర్ల డీజిల్ పొదుపు చేసిన డ్రైవర్ ఇ.గోవిందుకు ద్వితీయ బహుమతిని, అలాగే అధిక ఈపికె తెచ్చిన కండక్టర్లకు కూడా ప్రశంసా పత్రాలతో అభినందించడం జరిగినది. ఈ అభినందన సభలో ట్రాఫిక్ సూపర్వైజర్లు, గ్యారేజ్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

నీరు నిలిచి దెబ్బ తింటున్న వంతెన

ప్రజాశక్తి-చాపాడు:

మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారి కుందూ నదిపై ఉన్న వంతెన వర్షపు నీరు నిలిచి దెబ్బతింటోంది. వంతెనపై వర్షపు నీరు తొలగిపోయేందుకు ఏర్పాటు చేసిన రంధ్రాలు వ్యర్థ పదార్థాలు, దుమ్ముతో నిండిపోవడంతో నీరు నిలుస్తోంది. వంతెనపై పర్యవేక్షణ కరువు కావడంతో నీరు ఏ మాత్రం తొలగిపోవడం లేదు. ఆదారిన వెళ్లే ద్వి చక్రవాహనదారులు, పాదచారులకు కూడా ఇబ్బందిగా ఉంది. భారీగా కురుస్తున్న వర్షాలకు వర్షపునీరు నిలుస్తున్నది. జిల్లాలో వర్షాలకు వంతెలను దెబ్బతింటున్నాయి. వంతెనపై రోడ్డుకు గుంతలు కూడా ఏర్పడ్డాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుందూ నది వంతెనపై వ్యర్థ పదార్థాలను తొలగించి వర్షపు నీరు నిలువకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - చాపాడు : మండల పరిధిలోని భద్రిపల్లె గ్రామంలో వెలసిన దిగంబర వీరయ్య స్వామి 47వ ఆరాధన మహోత్సవాన్ని బుధవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. గురుపూజ పుష్పాలంకరణతో పూజా కార్యక్రమం ప్రారంభించారు. వివిధ గ్రామాల తాళాల భజన బృందాలచే 24 గంటలపాటు నిరంతరం కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నెర్రవాడ వారిచే కోలాటం, శ్రీ సాయి నాట్య కళా సమితి అద్దంకి వారిచే భక్త చింతామణి పూర్తి నాటకం, శివలీల వైభవం ప్రదర్శించారు. నిరంతరంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అభివృద్ధి కమిటీ సభ్యులు సుబ్బరాయుడు, ఓబుల్ రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నూతన మెడికల్ ఆస్పత్రి పరిశీలన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్: పట్టణంలో ఉన్న ప్రాంతీయ ఆస్పత్రిని నూతనంగా నిర్మించిన వైఎస్ఆర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాల్లోకి మార్చిన వైద్యశాలను ఎన్ఎంసి పరిశీలకుడు సుగుణ పరిశీలించారు. బుధవారం వైద్యశాలలోని భవ నాలను పరిశీలించి, అక్కడ ఉన్న సౌకర్యాలు, రోగులకు అందుతున్న వైద్యులు, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలను సూపరింటెండెంట్ డాక్టర్ మల్లే శ్వరిని అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో డాక్టర్ జ్ఞానేశ్వర్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.


ఫాగింగ్ చేస్తున్న పారిశుధ్య కార్మికుడు

ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనర్ పి.ఆర్.మనోహర్ పేర్కొన్నారు. పట్టణంలోని అన్ని వీధుల్లో ఫాగింగ్ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు విజృం భించే అవకాశాలు ఎక్కువ అన్నారు. ముఖ్యంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాల బారిన ప్రజలు పడుతున్నారని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని దోమలు వృద్ధి చెందకుండా పట్టణంలో ప్రతి రోజు ఫాగింగ్ మిషన్ ద్వారా ఫాగింగ్ చేయిస్తున్నట్లు చెప్పారు.ఈ బాధ్యతలను నగర పంచాయతీ శానిటేషన్ అధికారి కిరణ్ కుమార్, ఎఇ రాజేందర్‌కి అప్పగించినట్లు తెలిపారు. పట్టణంలో ప్రతి రోజూ పారిశుధ్య పనులు యథావిధిగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు.

మండలంలో విద్యుత్ అధికారుల దాడులు

ప్రజాశక్తి-నందలూరు

మండల కేంద్రంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీలోని అరవపల్లె, నాగిరెడ్డిపల్లె, నందలూరు గ్రామపంచాయతీలలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు బుధవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. విద్యుత్ చౌర్యం, అడిషనల్ లోడ్, మాల్ ప్రాక్టీస్ లను పరిశీలించారు. 30 అధిక లోడ్, ఆరు ఫిల్టరైజ్, మూడు డిటి, ఆరు మాల్ ప్రాక్టీస్ కేసులను నమోదు చేశారు. మొత్తం కేసులకు సంబంధించి రెండు లక్షల రూపాయల అపరాధ రుసుమును వేసినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడులలో డిపి ఎస్ఇ శ్రీనివాసబాబు, డిఇ రమేష్, డిఇఇ మధులత, ఎఇ రవిశంకర్, ఒంటిమిట్ట డిఇఇ మురళీధర్ రెడ్డి, స్థానిక ఎఇ బాలసుబ్రమణ్యం, లైన్‌మేన్ శ్రీరామ్‌కిరణ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.


దాడుల వివరాలను వెల్లడిస్తున్న విద్యుత్ అధికారులు

క్రైం కార్నర్

అక్రమ రేషన్ బియ్యం సీజ్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలో అక్రమంగా నిలువ ఉంచిన రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు సివిల్ సప్లయ్స్ డిప్యూటీ తహశీల్దార్ వెంకటరెడ్డి, సిఐసూర్య నారాయణలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు పంపిణీ చేయు 229 కేజీల రేషన్ బియ్యాన్ని బి.కొత్తకోటకు చెందిన ఆది నారాయణ అనే వ్యక్తి నిల్వ ఉంచుకున్నారని తెలిపారు. రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసు కుని నిందితుడిపై కేసు నమోదు చేసి నట్లు పేర్కొన్నారు. రేషన్ బియ్యా న్ని ఎవరైనా అక్రమంగా కలిగిఉన్నా, సరఫరా చేసిన చట్టరీత్యా నేరమని తెలిపారు.


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని చూపుతున్న డిటి

8 మంది పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-ములకలచెరువు

పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు మొలకలచెరువు ఎస్ఐ తిప్పేస్వామి పేర్కొన్నారు. మండలంలోని మద్దినాయునిపల్లి పంచాయతీ, నడింపల్లి క్రాస్ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో కలిసి దాడులు చేశామని తెలిపారు. ఈ దాడులో నడుంపల్లి సమీపంలోని ఓ పొలంలో పేకాట ఆడుతుండగా ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.3200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్టు చేసిన వారిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. జూదం, కోడి పందెం అడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నాటుసారా అమ్ముతున్న మహిళ..

ప్రజాశక్తి -మదనపల్లె అర్బన్

నిషేధిత నాటు సారా అమ్ముతున్న మహిళను మదనపల్లె సెబ్ పోలీ సులు బుధవారం అరెస్టు చేశారు. నిందితురాలి అరె స్టుకు సంభందించి సెబ్ సిఐ రమేష్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని బెంగుళూరు రోడ్డు, నక్కలదిన్నె తండా లో ఉంటున్న గోపినాయక్ భార్య పద్మావతి(48) ప్రభుత్వ నిషేధిత నాటుసారా అక్రమంగా విక్రయిస్తున్నట్లు సెబ్ ఎస్ఐ హేమకుమార్‌కు సమాచారం అందిందని తెలిపారు. వెంటనే సిబ్బందితో వెళ్లి ఆమె ఇంట్లో సోదాలు జరపగా, సోదాల్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న 15 లీటర్ల నాటుసారా స్వాదీనం చేసుకుని సీజ్ చేసి, కేసు నమోదు అనంతరం అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు.

ఆటో బోల్తా : విద్యార్థి మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆటో బోల్తా పడిన ఘటనలో ఓ విద్యార్థి మృతి చెందాడు. ముదివేడు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి కథనం మేరకు.. మండలంలోని ముదివేడుకు చెందిన ఎస్.రఫీ, షబానా దంపతుల కుమారుడు జియావుల్లా(15) స్థానిక మోడల్ స్కూల్లో 10వ తరగతి చదువుతున్నాడు. సాయంత్రం పాఠశాల ముగించు కుని ఆటోలో ఇంటికి బయల్దేరాడు. మార్గమధ్యంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జియావుల్లా తీవ్రంగా గాయపడ్డాడు. 108 సిబ్బంది బాధిత విద్యార్థిని హుటాహుటిన మదనపల్లె సర్వజన బోధనాస్పత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసరం విభాగం డాక్టర్లు మెరుగైన వైద్యం అందించినా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి మహిళకు గాయాలు

ప్రజాశక్తి-కలకడ

ద్విచక్ర వాహనం అదుపుతపడంతో మహిళలకు గాయాలైన సంఘటన మండలంలో బుధవారం జరిగింది. మండలంలోని కోట గుడిబండ పంచాయతీ కోట గుడిబండకు చెందిన గంగ ప్రసాద్ అతని భార్య నవలతలు కలసి తమ ద్విచక్ర వాహనంలో సొంత పనుల మీద మదనపల్లికి వెళ్లి తిరిగి వస్తున్నట్లు తెలిపారు.ఈ క్రమంలో మండలంలోని కోన సమీపంలో ఉన్న గొబ్బిళ్ళవారిపల్లి సమీపంలో వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురైనట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే విషయం తెలుసుకున్న 108 సిబ్బంది హుటా హుటిన సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదానికి గురైన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన తెలిపారు. కార్యక్రమంలో 108 సిబ్బంది పైలెట్ శ్రీనివాసులు, రవి పాల్గొన్నట్లు తెలిపారు.